క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మూసాపేట: సైబర్ సిటీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివేక్‌నగర్, ఆర్‌వీ ప్రాంతాలలో, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు బాలాజీనగర్, వివేక్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

జన్మభూమి ఫీడర్ పరిధిలో..

భాగ్యనగర్‌కాలనీ: జన్మభూమి 11కెవి ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గణేశ్‌నగర్, తారాకరామారావ్ నగర్, దత్తాత్రేయ కాలనీ, జన్మభూమి కాలనీ ప్రాంతాలలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు భాగ్యనగర్‌కాలనీ ఫేజ్ 3, ఎంఎన్ఆర్ కళాశాల వెనుక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అథర్ షఫియాకు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థిని అథర్ షఫియాకు పీహెచ్‌డీ డిగ్రీని ఆదివారం ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మేనేజ్‌మెంట్ విభాగంలో అథర్ షఫియాకు ఈ డిగ్రీని ప్రకటించారు. ఆమె 'క్వాలిటీ ఆఫ్ వర్క్ లైఫ్ అండ్ ఎమోషనల్ లేబర్ అమాంగ్ ఎయిర్‌హోస్టెస్‌లు: ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ ఎయిర్‌లైన్స్ ఇన్ ఇండియా'అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. ఆమె మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగంలో ఫ్యాకల్టీ డాక్టర్ షేక్ కమ్రుద్దీన్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమెను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

శంకుస్థాపన



ప్రత్యేక పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని సంగీత్‌నగర్‌లోని నల్లపోచమ్మ తల్లి ఆలయంలో షెడ్ నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళ్‌రావు శంకుస్థాపన చేశారు. అంతకుముందు అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. డివిజన్ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, బాబు, శంకర్‌రావు, రామకృష్ణారెడ్డి, గోవింద్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో వాగ్గేయకార సౌరభం

మాదాపూర్: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ వాణీ మ్యూజిక్ అకాడమీ మాదాపూర్‌లోని మల్లన్న ఆలయంలో ఆదివారం వాగ్గేయకార సౌరభం (సంగీత) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఎర్రగొల్ల శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ నర్రా సుఖేందర్‌రెడ్డి అతిథులను ఘనంగా సత్కరించారు. రాగం సతీష్‌యాదవ్, బ్రహ్మకుమారీస్ చంద్రరేఖ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పాదయాత్ర



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తులసీ నగర్ లో ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ పాదయాత్ర నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్‌లోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నామన్నారు. డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. కాలనీలో సీసీ కెమెరాల అవశ్యకతను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, నాయకులు మల్లేశ్‌గౌడ్ రమేశ్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర సంగీత సాహిత్య సమ్మేళనం

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో వెంపటి లక్ష్మి శ్రీనివాస శాస్త్రి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంపటి లక్ష్మీనారాయణ శర్మ ఆధ్వర్యంలో శాస్త్ర సంగీత సాహిత్య సమ్మేళనం తొమ్మిదవ వార్షికోత్సవ సంబురాలు ఆదివారం నిర్వహించారు. వేదవతి ప్రభాకర్ శిష్యబృందంచే సంగీత లయ విన్యాసంలో భాగంగా రమ్య, తేజస్వీ పాటలను ఆలపించారు. చావలి బాలాత్రిపురసుందరి శిష్యబృందంచే కూచిపూడి నృత్యప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. వసంత, స్వరజతి, బృందావన నిలయే, దేశభక్తి గీతం తదితర అంశాలను సౌమ్య, శ్రీయ, శశికళ, వైష్ణవి, అనన్య, అనురిత, ఇషితా, వెంకట్ దీక్షితులు ప్రదర్శించి అలరించారు.

పట్టా భూములపై హక్కులేవీ.!

- నత్తనడకన నిషేధిత జాబితా నుంచి తొలగింపు ప్రక్రియ
- వివాదాస్పద ,కోర్టు కేసులున్న వాటి సమీప భూములు కూడా..
- సర్కారు ఆదేశాలిచ్చినా ..అవగాహన లేమితో పరిశీలనలో జాప్యం
- రైతులు, యాజమానులకు తప్పని ప్రదక్షిణలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: సాంకేతిక కారణాలతో పట్టా(సొంత) భూములపై హక్కులు కోల్పోయిన రైతులు, ప్లాట్ల యాజమానులు తమకు న్యాయం చేయాలని ప్రతి రోజు నగర శివారు కలెక్టర్ ,రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం దక్కడం లేదు. ధరణి పోర్టల్‌కు సంబంధించి పూర్తి అధికారాలను ప్రభుత్వం కలెక్టర్లకు అప్పగించటంతో పని భారం వల్ల ఈ దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించక పోవటంతో పెండింగ్‌లో పడుతున్నాయి. ఇటీవల ఓటర్ల జాబితా తదితర అంశాలలపై కలెక్టర్లతో సహా రెవెన్యూ యంత్రాంగం బీజీ కావడం కూడా జాప్యానికి కారణంగా తెలుస్తోంది. దీంతో దరఖాస్తు దారులు నానా ఆగచాట్లు పడుతున్నారు. ధరణి పోర్టల్‌తోపాటు ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలు తప్ప కలెక్టర్లు మిగతా సమస్యలపై ఫోకస్ చేయలేక పోతున్నారన్న విమర్శలు లేకపోలేదు.

◆ సర్కారు ఆదేశించినా ...

నిషేధిత జాబితాలో నమోదైన పట్టా భూములను స్వచ్ఛందంగా తొలగించాలని ప్రభుత్వం నిర్దేశించినప్పటికీ,ఈ ప్రక్రియ నత్తకు నడక నేర్పుతోంది. రైతుల సంక్షేమమే లక్ష్యంగా.. సర్కారు ముందుకొచ్చినా క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారుల సహాయ నిరాకరణతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత ప్రభుత్వ భూములను ధరణి పోర్టల్‌లోని నిషేధిత జాబితా 2 (ఎ)లో నమోదు చేశారు. అదే సమయంలో సాంకేతిక కారణాలతో పాటు సిబ్బంది తప్పిదాల వల్ల కొన్ని పట్టా భూములు కూడా అందులో చేరాయి. దీనికి తోడు ప్రభుత్వ భూములకు సమీపంలోని స్థలాలు కూడా నమోదయ్యాయి. సమీపంలో వివాదాస్పద ,కోర్టు కేసులున్న భూములు, ప్లాట్లు కూడా నిషేధిత జాబితాలో చేరాయి. దీంతో ఆడ పిల్లల పెళ్లిళ్ల ,ఆసుపత్రుల ఖర్చుల నిమిత్తంతోపాటు పలు అవసరాల కోసం వాటిని విక్రయించేందుకు రైతులు ,ప్లాట్ల యాజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

◆ కొరవడిన అవగాహన..

నిషేధిత జాబితా నుంచి పట్టాభూముల తొలగింపు ప్రక్రియలో తహసీల్దారుతోపాటు రెవెన్యూ ఉద్యోగులు కీలక భూమిక పోషించాల్సి ఉంది. ఈ ప్రక్రియపై అవగాహన కొరవడిన రెవెన్యూ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు ఎదురవుతున్నాయి. ఉన్నతాధికారుల నిఘా లేని పలు చోట్ల కొందరు రెవెన్యూ ఉద్యోగులు కూడా ప్రతి ఫైల్‌కు రేట్లు ఫిక్స్ చేసి...కొర్రీలు పెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

◆ ఇక్కడే అత్యధికం

నిషేధిత భూముల జాబితాను వ్యాప్తంగా పరిశీలిస్తే... నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. శివారులోని ఈ రెండు జిల్లాల పరిధిలో అత్యధిక మండలాల్లో రైతులు పట్టా భూములు, కోర్టు కేసులకు సంబంధించిన భూములపై ఉన్న నిషేధం తొలగింపుపై గత కొన్నేళ్లుగా కలెక్టర్ ,రెవెన్యూ కార్యాయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వంశ పారంపర్యంగా వచ్చిన పట్టాభూములు కూడా నిషేధిత జాబితాలో చేరడంతో వాటిని విక్రయించుకోలేక పోతున్నారు.

దీంతో నగర శివారు జిల్లాల్లోని పలు మండలాల్లో రెవెన్యూ సిబ్బంది తప్పిదాల వల్ల కూడా చాలా మంది రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయాలి



త్రివర్ణ పతాకాలను అందజేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: త్రివర్ణ పతాకం మనందరికి గర్వకారణం ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసి స్వాతంత్ర్య దినోత్సవ సంబురాలు జరుపుకోవాలని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ప్రజలను కోరారు. ఆదివారం డివిజన్‌లోని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులకు త్రివర్ణ పతాకాలను అందజేశారు.

ఉర్సు ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ఓల్డ్ బోయిన్‌పల్లి: బోయిన్‌పల్లి చెక్‌పోస్టు సమీపంలోని సయ్యద్ నశిరుద్దీన్ షా ఖాద్రీ దర్గా వద్ద నిర్వహించే ఉత్సవాలకు చేస్తున్న ఏర్పాట్లను ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పరిశీలించారు. ఆదివారం ఉర్సు నిర్వాహకులతో ఏర్పాట్ల విషయంలో కావాల్సిన పనులపై చర్చించి ఏర్పాట్లను ఘనంగా నిర్వహించాలన్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈనెల 15వ తేదీన జరిగే ఈ ఉర్సు ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఉర్సు నిర్వాహకుల కోరిక మేరకు ఈ ఏర్పాట్లు ఉంటాయని అన్నారు.

తుల్జా భవానీ గోందాలి సమాజ్ ఆత్మీయ సమ్మేళనం



ఎమ్మెల్యే గాంధీని సన్మానిస్తున్న సమాజ్ సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలోని రాధాకృష్ణ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం తుల్జా భవానీ గోందాలి సమాజ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికాపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గోందాలి సమాజ్ వారికి ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికి అందజేస్తామన్నారు. ఆత్మ గౌరవ భవన నిర్మాణం కోసం 2 ఎకరాల స్థలం కేటాయింపుపై ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణగౌడ్, ప్రసాద్, సమాజ్ అధ్యక్షుడు ఎక్‌నాథ్ ధుంగే, రాజేంద్ర వనర్సీ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నా దేశం.. నా మట్టి



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: మూసాపేటలోని హనుమాన్ చౌక్ వద్ద మేరీ మాటి మేరా దేశ్ (నా దేశం నా మట్టి) కార్యక్రమాన్ని మూసాపేట కార్పొరేటర్ మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవం పేరుతో ఎంతో ఘనంగా దేశభక్తి కార్యక్రమాలు చేసుకున్నామని అన్నారు. 150 మంది విద్యార్థులతో జాతీయ పతకాలతో పాటు మూడు రంగుల బెలూన్లు అందజేశామని అన్నారు. 2049 సంవత్సర నాటికి వాడే ప్రతి వస్తువు ఈ దేశంలో తయారు అయినవే ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పిట్ల మనోహర్, నాయకులు వినోద్, మల్లేశ్ గౌడ్, పాలాకి కిషోర్‌కుమార్, వినోద్‌కుమార్, శివరాజ్‌యాదవ్, రమేశ్ నాయుడు, సురేశ్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి

గచ్చిబౌలి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిఒక్కరూ జాతీయ జెండాను ఇంటిపై ఎగురవేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జెల యోగానంద్ పిలుపునిచ్చారు. ఆదివారం గచ్చిబౌలిలోని రాడిసన్ హోటల్‌లో 'హర్ ఘర్ తిరంగా'కార్యక్రమంలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ భాగంగా ప్రతి భారతీయుడిలో దేశ భక్తి భావాన్ని ప్రేరేపించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి భారతీయుడికి త్రివర్ణ పతాకంతో భావోద్వేగ అనుబంధం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ సెంట్రల్ కో ఆర్డినేటర్, సుప్రీంకోర్టు న్యాయవాది బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ క్యాంపస్‌లో 'ఆజాదీ ర్యాలీ'

రాయదుర్గం: దేశంలో అమలు చేస్తున్న విద్యను, రాజ్యాంగాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ 'ఆజాదీ ర్యాలీ'ని నిర్వహించారు. స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి క్యాంపస్‌లో కాగడాలతో ర్యాలీని నిర్వహించారు. హెచ్‌సీయూలోని ఎల్‌హెచ్-10 హాస్టల్ నుంచి సౌత్ షాపింగ్ కాంప్లెక్స్ వరకు కాగడాలతో ఈ ర్యాలీ కొనసాగించారు. భారతదేశంలో రాజ్యాంగాన్ని, విద్యావ్యవస్థను, భారతదేశాన్ని కూడా కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ ర్యాలీ కొనసాగించారు. అనంతరం భారతదేశాన్ని, రాజ్యాంగాన్ని, విద్యా వ్యవస్థను కాపాడాలని కోరుతూ గీతాలను కూడా ఆలపించారు. ఎస్ఎఫ్ఐ హెచ్‌సీయూ విభాగం కార్యదర్శి మోహిత్, అధ్యక్షుడు సోహెల్, యూనియన్ ప్రధాన కార్యదర్శి క్రిప, సీఈసీ సభ్యుడు శివ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయనగర్ రోడ్డు నెంబర్ 7లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ పి.బాబురావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీసీ రోడ్డు పనులను వేగవంతంగా చేయాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ ప్రభాకర్‌గౌడ్, నాయకులు కృష్ణంరాజు, కృష్ణ,భాస్కర్ రావు, సుశీల్, రవిసింగ్, మోహన్ పాల్గొన్నారు.



ఆంజనేయనగర్‌లో పనులను పి.బాబురావు



బీఆర్ఎస్‌లో చేరికలు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న మహిళలు

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ మహిళ మోర్చా జనరల్ సెక్రటరీ జగదీశ్వరి, ఉపాధ్యక్షులు బృందావతి, కృష్ణవేణి, విద్యావతి, కమలమ్మల ఆధ్వర్యంలో 50 మంది ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పార్టీలోకి ఎంతో మంది వస్తున్నారని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రతి రోజు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయని వివరించారు. ఆయా పనులపై సమీక్షలు, సమావేశం నిర్వహిస్తు పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. ఎన్నో ఏళ్లుగా సమస్యలు పరిష్కరించడం.. కార్యక్రమాలు చూసి తమ నాయకత్వంలో పని చేసేందుకు బీఆర్ఎస్ పార్టీలోకి చేరామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు.

గద్దర్‌కు నివాళి



భరత్‌నగర్‌కాలనీలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాకర్స్

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని పార్కులో ఆదివారం ప్రజా గాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పాటతో తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది ఉద్యమం వైపు నడిపించారని అన్నారు. ఆయన సజీవంగా లేకున్నా ఆయన పాట ప్రజల మదిలో ఎప్పటికీ చిరస్థాయిగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ నాగిరెడ్డి, విజయ్‌కుమార్, మాణిక్‌రెడ్డి, విజయ్‌కుమార్, కృష్ణయ్య, వెంకటేశ్వరావు, రవీందర్, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, రామ్మోహన్, గోపాల్, బుచ్చిబాబు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వయో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం



సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధులతో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఉచిత వైద్య శిబిరాన్ని సీనియర్ సిటిజన్స్ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఆదివారం పీవీ ఎన్‌క్లేవ్‌లో స్నేహా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ భవనంలో మేడ్చల్ జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోబైల్ మెడికేర్ యూనిట్ ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 60 మంది కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సూర్యప్రకాశ్‌రావు, సుధాకర్, రాజుయాదవ్, సయ్యద్ ఏజాజ్, ఇర్ఫాన్, బుర్రి యాదగిరి, చందు యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి ఎల్లప్పుడు ముందుంటా



ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న తులసీనగర్ సంక్షేమ సంఘం సభ్యులు

ఆల్విన్‌కాలనీ : ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తులసీ నగర్ వీకర్ సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతనంగా ఏర్పడిన కాలనీ సభ్యులు ఆదివారం కార్పరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ సమక్షంలో ఎమ్మెల్యే అరికాపూడి గాంధీని మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి అభినందనలు తెలుపుతూ కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాలనీలోని సమస్యలను తమ దృష్టికి తీసుకవస్తే ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, జనరల్ సెక్రటరీ శివ, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, రామకృష్ణలు, ట్రెజరర్ గోపాల్ నాయక్, మెంబర్లు సాయిబాబు సురేశ్, యేసు, జైపాల్‌రెడ్డి, శ్రీదర్, మధు, భువనేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాపిరెడ్డినగర్ కాలనీ సమస్యలపై వినతి...

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్ కాలనీ వాసులు పలు సమస్యలు వివరిస్తూ ఆదివారం ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాలనీ అభివృద్ధికి తాము ఎల్లప్పుడు ముందుంటామన్నారు. కాలనీ సమస్యలు తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, నాయకులు భగవంత్‌రెడ్డి, వెంకటరెడ్డి, మహేందర్ రెడ్డి, సాబశివరావు, మురళి, కరుణ, వీరబాబు, నవీన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత వినాయక విగ్రహాలను పూజిద్దాం



భగత్‌సింగ్‌కాలనీలో మొక్కలు నాటుతున్న రోటరీ జిల్లా గవర్నర్ శంకరరెడ్డి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని భగత్‌సింగ్‌కాలనీలో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ హైదరాబాద్ గ్రీన్ గణేశా పేరుతో కాలుష్య రహిత వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పీడీజీ, రోటరీ జిల్లా గవర్నర్ శంకరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలుష్య రహిత వినాయక విగ్రహాలను మండపాలలో ప్రతిష్ఠించాలని పిలుపునిచ్చారు. 13 సంవత్సరాలుగా కార్యక్రమం విజయవంతంగా సాగుతోందన్నారు. ఈ ఏడాది 7లక్షలకు పైగా కుటుంబాలకు కాలుష్య రహిత గణేశ్ విగ్రహాలను పూజించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇప్పటికే పలు కాలనీల్లో, స్కూళ్లలో, కళాశాలలో ప్రజలను చైతన్య పరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్‌వీ రాంప్రసాద్, రోటరీ క్లబ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు శివశంకర్, సెక్రటరీ కేవీ శ్రీనివాస్‌రావు, రోటరీయన్ వేణు, రోటరీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రోటరీ క్లబ్ నాయకులు


అప్‌డేట్ కావాల్సిందే..

- పదేళ్లు పూర్తయిన వారందరికీ ఆధార్ నవీనీకరణ తప్పని సరి
- అడ్రస్, పేరులో అక్షరాలు, ఫొటో, ఫోన్ నంబర్ మార్పునకు అవకాశం
- వచ్చేనెల 14 వరకు గడువు పొడిగింపు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఆధార్ కార్డు నవీకరణ గడువును కేంద్ర ప్రభుత్వం మరో మూడు నెలల పాటు పొడిగించింది. కార్డులు పొంది పదేళ్లు పూర్తయిన వారు, ప్రస్తుతం ఉన్న కార్డులను నవీనీకరించుకోవాలని ఇప్పటికే యూఐడీఏఐ సూచించింది. ఆధార్ కార్డు నవీనీకరణకు మొదట జూన్ 14 వరకు గడువు విధించారు. అయితే ప్రజల నుంచి నామ మాత్రంగా స్పందన రావడంతో గడువును మరో మూడు నెలల పాటు పొడిగించారు. 2010-18 సంవత్సరాల మధ్య ఆధార్ కార్డులు పొందినవారు సెప్టెంబరు 14 వరకు ఉచితంగా నవీనీకరించుకోవచ్చని ప్రభుత్వం సూచించింది.

రెండు రకాలుగా...

ఆధార్ కార్డును మై-ఆధార్ పోర్టల్, ఎం-ఆధార్ యాప్‌లో ఉచితంగా నవీనీకరించుకోవచ్చు. ప్రభుత్వ కార్యాలయాల్లో కొనసాగుతున్న శాశ్వత ఆధార్ కేంద్రాల్లోనూ మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. ఆధార్ ప్రక్రియ ప్రారంభమైనప్పుడు గతంలో ప్రజలు చెప్పిన వ్యక్తిగత వివరాలను మాత్రమే హడావుడిగా నమోదు చేశారు. చాలా మంది తప్పుడు సమాచారం ఇచ్చినట్లు గుర్తించారు. ప్రస్తుతం,... గతంలో ప్రజలు వెల్లడించిన వివరాల ప్రకారం ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసి నవీనీకరించుకోవచ్చు. నవీనీకరణకు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పత్రాన్ని ఖచ్చితంగా సమర్పించాల్సి ఉంటుంది. అక్షరాస్యులైతే పదో తరగతి మార్కుల మెమోను తీసుకెళ్తే సరిపోతుంది. ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డు, ఉపాధిహామీ జాబ్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, పాస్ పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, వివాహ పత్రం, తహసీల్దార్ జారీ చేసిన ధ్రువపత్రాలను తీసుకెళ్లి ఆధార్ కార్డు నవీనీకరణను పూర్తి చేసుకోవచ్చు.



ఇతర మార్పులకు ఇలా...

ప్రస్తుతం పదేళ్లు దాటిన వారందరూ ఆధార్ కార్డు సమాచారాన్ని నవీనీకరించుకోవాల్సి ఉంది. దీంతోపాటు పేరులో అక్షరాలను సరి చేసుకోవడానికి, ఫొటో, చిరునామా మార్పు, ఫోన్ నంబర్లలో మార్పులు చేసుకోవచ్చును. జిల్లాలోని చాలా గ్రామాల్లో ప్రస్తుతం ఆధార్ నమోదు కేంద్రాలు అందుబాటులో లేవు. నవీనీకరణకు తప్పనిసరిగా మండల కేంద్రాలకు వెళ్లాల్సి ఉండటంతో చాలా మంది ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. గతంలో కొత్తగా ఆధార్ కార్డుల జారీ సమయంలో గ్రామాల వారీగా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ నవీనీకరణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.